కథానిక

# అమరావతి

మల్లాది రామకృష్ణశాస్త్రి

వైభవ దేవేంద్రుడు, వాసిరెడ్డి వెంకటాద్రి ప్రభువు, కృష్ణకు యిద్దరి అద్దరి మాగాణం అంతా చెక్కుచెదరని ధర్మవిక్రమంతో ప్రజలకు తండ్రిగా పెద్దలకు విధేయుడుగా, శాసనానికి తలవరిగా శత్రువులకు చండశాసనుడిగా, ఏలుకుంటూన్న చల్లని హయాములో—

ఎల్లవేళలా ఎండనక నీడనక విచ్చుకత్తులవారు, బరిసెలవారు, బల్లాలవారు, మీసముమిగిలిన వీర రాహుతులందరూ పచ్చెపువాళ్ళ బాదరబందీ, ఏ పరగణాకూ సోకనీకుండా వేయికన్నులుగా వేయికివేయి బాహువులుగా పరాక్రమాల మెలగుతూ ఉండగా,—

సింగారం పొలిమేరల్లో, ఎన్నితరాలుగానో ఊడపాదుకున్న మఱ్ఱి-నీడను ఏనాడో, తలపండిన తబసి చిన్న పర్ణశాలలో, బుల్లితులసీ బృందావనం మయంగా, కృష్ణాజినంమీద చిత్రాసనంమీద దర్భాసనంమీద పద్మాసనంగా పొద్దు పొడిచిం దెరుగక, సంజకమ్మిం దెరుగక అలా కదలని కాలూ మూసినకన్నుగా మనకు కానరాని, ఆదేదో మగతలో ఉండిపోయినాడు.

చివరకు ఎన్నాళ్ళకో ఓనాడు, ఆ తబిసి గుండెల్లో బొమముడిలో చిక్కిన వెలుగు పట్టుపగ్గాలు లేక, ఉబికిఉబికి పండువెన్నెలై రెక్కలకు అందని మేరకూ పులుగులు నేరని దూరాలకూ ఎగిసిపడి ఎగబాకి, ఆకాశగంగై వరాహస్వామి ఉద్ధరించిన చేనంతా చిలకరించింది: తబిసి కన్ను తెరిచాడు.

తానై కన్ను తెరిచాడు; తనోమనిషి ననుకున్నాడు; తన్ను తానెరిగినాక దగలున్నాయ్ దప్పికలున్నాయ్-దాహమైంది తబిసికి. కమండల ఉంది-నీరులేదు.

ఎవరీ పనికిమాలింపని వెలుగెత్తని మౌనం ఉరుములు పెట్టున గర్జించింది.

ఆమడదూరాన లేడల్లే నోతూన్న- నీడమనిషి ఒక్క చుట్టుతిరిగి, తబిసి ముందర గిరవాటుపడి, సొమ్మసిల్లబోతూ, నేనే అయ్యా, అని ఆ పాదాలకు మనవి చేసుకున్నాడు.

"నేనంటే""

"దొంగను."

"కావేమో!"

"నాకా అనుమానం లేదయ్యా!
పుట్టింది దొంగ కడుపున
పెరిగింది దొంగ ఒడుపున-
కాదంటే నాకు అవమానం కాదయ్యా!
అది మీ అజ్ఞానం—"

తబిసి, కనపడని కదలికతో, కనురెప్పతో రవంతగా, ఆ పలుకులకూ మ్రొక్కాడు-

"శపించనా!"

"కూడదయ్యా! చేసిన తపసంతా, నాపాపం మీద కత్తి పదునుగా ధారపోస్తారా!
"శిక్షించే వరం-ఏ మహారాజుపరమో చేయండి."
నీడ వెలుగులో మాయమైపోయింది.

పిండారీ మూకలు, దేశం గగ్గోలు చేస్తున్నాయ్. పరగణా అంతటా ఒకటే నరుకుల -వేట్లాట- మన్నె సుల్తానుకు యీ బెడద చెవి సోకనీకుండా, ప్రజలే, ఏ వాడకు ఆ వాడను, ఏ సీమకు ఆ సీమను కాచుకుంటున్నారు.

సంకురాతిరి పండుగపూట, తెల్లవారకముందే వెంకట్రావు ప్రభువు కృష్ణలో స్నానం చేస్తు ఉన్నపాటున ఉండి, ఉలికిపాటుగా "పట్టింది తాతగారూ!" అని, ధైర్యంగానే కేక వేశారు!

అల్లంత దూరాన జపం చేసుకుంటున్నారు- పాపయారాధ్యులవారు. వారు అరగన్నుగానే, "దేశానికా నీకా, నాయనా!" అని తనలోతాను అనుకున్నారు.

పట్టింది మొసలే అయితే, ఆ మొలకువ తెలుసును నాయుడుకి. ఆవేటలో తరతరాలుగా మొనగాడాయెను. కాని ఆ పట్టు మొసలిపట్టు కాదు. ఆ ఒడుపు మొసలి ఒడుపుకాదు. కాలు కరకర మనలేదు. నీరు కందలేదు.

పట్టిన దొంగ పాదం విడిచి ఈశ్వర్తున నిలుచున్నాడు.

"ఎవరవయ్యా!" అన్నారు ప్రభువులు.

"బతిమాలేదుంకు, పాదం పట్టిన వాడినయ్యా! తల్లికపున తారసిల్లాం-దానంచేయవయ్యా-దయా జాలీ,ఆ చేత, ఈ చేత ధారపోయవయ్యా తండ్రీ!-"

పాపయారదులు—సందడిగా చేరువవు వస్తు న్నారు - వస్తూనే సెలవిస్తున్నారు- మరిపలు విప్పుకు మొనగాడా!

అర్థమయ్యేట్టు చెప్పేవుసుమీ! ప్రభువులకు పాపభీతి బలిసి, పుణ్యానికి వేసగి వచ్చింది"

వెంకటాద్రినాయుడు తనమనసు ధారావత్తం చేశాడు. దొంగ ఒక్కముసుకతో ఏటిపాలై పోయినాడు.

వేటలో పట్టితెచ్చిన మృగాలనూ వేడుక చూపించడం ప్రభువులకు అలవాటు. పిండారి మూకను పట్టితెచ్చారని పరగణా అంతటా ఒక్క చిటికెలో సాటింపు అయింది. తిరునా ళ్ళకు వచ్చింది ప్రజ-

ఒక్కబారున ఒకేవెన్న విరుపున చింతల తోపులో ఉంది పిండారిమూక అటునుంచి నరుక్కువస్తున్నాయ్ విచ్చుకత్తులు: ఇటునుంచి నరుక్కుపోతున్నాయ్ పట్టాకత్తులు తలలన్నీ రాలినాయ్. ఒక్కతల మిగిలింది. అక్కడ అన్ని కత్తులూ ఆగినాయ్.

ఆ తల ఝళిపించింది ఆ కళ్లు కత్తులు సానబెట్టి నాయ్. కాని ఏ చెయ్యీ ఆడలేదు! ఏ అడుగూ ఆడలేదు!

"నాయనా!" అన్నది గొంతు:

కన్నెదుట పిలిచేది. ఆ దొంగ పిలుస్తూన్నది- పాపయారదులు.

"ఆఁ" అన్నాడు నాయుడు.

చేత కత్తి అందుకుని, ఓరగా చేరువయినాడు.

"ఏం ప్రభూ! దానంపట్టినవాడు ఈవరం మీపరం చేస్తున్నాడు. ఒక్కటే విసురు!"

ప్రభువు ఇంకా జంపుమీదే ఉన్నాడు.

"నీవు పిండారీవా?"

"కాను అంతకన్న గండడిని ఏం అయ్యా! ఎన్నిసార్లో పట్టి తెప్పించావు పిండారిమూకను.

[illegible]

పడి అటునుంచి నరికించి ఇంగు విడిచావు; ఇటు నుంచి నరికించి అటు విడిచావు. నీని దయ అను కున్నావ్. అంతకే ధర్మమనుకున్నావ్. నీ జాలి మాకు చేటు కానా; మీధర్మం పరగాకు ఆపద కానా మాటికిమాటికి మంటలు ఆర్పావే కాని, చిటిలే రవ్వల్ని ఏంచేశావ్! ఇక చాలించయ్యా! నీకు ప్రజలకన్న దైవముందా, మా మేలుకన్నా పూజ ఉందా? ఏలే ప్రభువుకు ఎవరు వంకబెడతారు? ఎదుటపడి, ఎవరు తప్పుదిద్దుతారు? సేవొక్కట్టే!"

ఏలేవారి తప్పు- నాతప్పు గాదా అనుకున్నా!

"ఎన్ని పుటకలుగానో పరగణాలో దోచుకు బతికేంతుకు హక్కు మాకు ఉంది. పచ్చగా ఉన్నా దోచుకుంటే అందం కాని, అల్లాడిపోయే ప్రజను చూస్తే గుండె తరుక్కుపోయింది; అటూ చెయిపోలా, నాధరపుంమీద మనసూ పోలా.

చలిదన్నా ముట్టకుండా యిటూ పడివచ్చా! మర్రిక్రింద ఓ అయ్య ముక్కుమూసుకుని ఉంటే సొరబుర్రలో నీరు కాసిని పుక్కిటపట్టినా! ఆ అయ్య కన్ను తెరిపించి కసిరించుకున్నా. ఒక్క ఉరకను వచ్చి, నీపాదంపట్టినా- దానంపట్టినా— దండులో కలిసి కాళ్ళబందామల్లే ఎటూ మెసలనీ కుండా- మీచేతపట్టించినా.

నరికిన పుణ్యం మీదేగాని, నరకించిన పాపం నాకెందుకూ-విసురు!—"

నాయడు ఆ కత్తితోనే ఆచేతులలా జోడించి "అమరేశ్వరా!"అన్నారు తగని జాలిగా.

"విసురు!"

విసురన్న మాట విసురున, కత్తి చళుకుమనడ మేమిటి, ఆ తల ఎగిరిపడటమేమిటి.

తలలేని మొండెం తపసులో ఉన్నట్టు పద్మా సనం వేసింది- తనువుకోకుండా వచ్చి, జీవంతో ఉన్న వేలు ప్రభువు నొప్టను తిలకం అద్దింది. నెత్తురు జీరతో.

ఆ దొంగ ఆచోకీలేదు. ఆచోటికిప్పుడు ఆన వాలు లేదు; ఆ కథా కమామీషూ నిన్నా మొన్నా పుట్టినవాళ్ళకు ఎరికేలేదు! నాయడిపేరు శిలాక్షరంగా ఉంది! ఆ ప్రభువు ధర్మం నూటొక్క గుడిలో దివ్వె వెలుగుతూంది— ఎవరి తపసో ఫలించింది. ఎలాగో వెలిసింది అమ రావతి. ★